క్లుప్తంగా

వరి గడ్డి దగ్ధం



పొన్నూరు: విద్యుత్ వైర్లు తగిలి మంటలు వ్యాపించడంతో వరిగడ్డి దగ్ధమైన సంఘటన మండలంలోని గాయం వారి పాలెంలో మంగళవారం చోటుచేసుకుంది. పొన్నూరు అగ్నిమాపక అధికారి కె.ఎస్ ప్రసాదరావు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన వడ్డూరి శ్రీనివాసరావు తన పొలం నుంచి వరిగడ్డిని ట్రాక్టర్‌లో ఇంటికి తీసుకు వెళుతుండగా ప్రమాదవశాత్తు విద్యుత్ వైర్లు తగిలి మంటలు వ్యాపించాయి. అగ్నిమాపక కేంద్రానికి సమాచారం అందించగా.. వెంటనే సంఘటనా స్థలానికి చేరుకొని మంటలను అదుపు చేశారు.

ఆర్టీసీ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి



పొన్నూరు: ఆర్టీసీ ఉద్యోగుల సమస్యలు వెంటనే పరిష్కరించాలని నేషనల్ మజ్దూర్ యూనిటీ అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు కె.శ్రీనివాసరాజు డిమాండ్ చేశారు. సమస్యల సాధన కోసం ఆర్టీసీ డిపోలో మంగళవారం రిలే నిరాహార దీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కొన్ని నెలలుగా సమస్యలు పరిష్కరించాలని కోరుతున్నా ప్రభుత్వం పట్టించుకోవడం లేదన్నారు. అక్రమ సస్పెన్షన్లు ఎత్తివేయాలన్నారు. జిల్లా కార్యదర్శి ఎం.శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ.. ఈ హెచ్ఎస్ స్థానంలో పాత వైద్య విధానాన్ని కొనసాగించాలన్నారు. ఆర్టీసీ ఉద్యోగులు పి.ఖుద్దూస్, ఎస్.ఎస్.రావు, సతీష్‌బాబు, శోభన్‌బాబు, షేక్.బాజీ తదితరులు పాల్గొన్నారు.

పుస్తకాలు విజ్ఞానాన్ని పెంచుతాయి



కాకుమాను: విద్యార్థులు విద్యార్థి దశ నుంచే పుస్తక పఠనాన్ని అలవర్చుకోవాలని ఎస్టీయూ రాష్ట్ర కౌన్సిలర్ గేరా మోహనరావు అన్నారు. పెదనందిపాడు తేళ్ల నారాయణ విజ్ఞాన కేంద్రంలో విద్యార్థులలో మానసిక ప్రశాంతత, మేధాశక్తి పెంపొందించేందుకు చిన్నారుల కోసం వేసవి శిక్షణా కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఆయన మాట్లాడుతూ.. పాఠశాలకు వెళ్లే విద్యార్థులు సమర్థవంతంగా చదివేందుకు వేసవి శిక్షణా కార్యక్రమాలు ఎంతగానో దోహదపడతాయని అన్నారు. విశ్రాంత ఉపాధ్యాయుడు గారపాటి రమేష్ మాట్లాడుతూ.. పుస్తకాలు విజ్ఞానాన్ని, మంచి ఆలోచనలను పెంచుతాయని అన్నారు. కార్యక్రమంలో దొప్పలపూడి రమేష్ బాబు, ఉపాధ్యాయిని జవహర్ రాణి, రామారావు, విద్యార్థులు పాల్గొన్నారు.

పెరిగిన చెట్లతో రాకపోకలకు అవస్థలు!



పొన్నూరు: పట్టణంలోని 19వ వార్డు ఎస్టీ కాలనీలో గత కొన్ని నెలలుగా వీధి దీపాలు పూర్తిస్థాయిలో వెలగకపోవడంతో స్థానికులు ఇబ్బందులు పడుతున్నారు. కాలనీలో పదుల సంఖ్యలో లైట్లు వెలగకపోయినా అధికారులు పట్టించుకోవడం లేదని వాపోతున్నారు. కాలనీకి వెళ్లే ప్రధాన రోడ్డు వెంబడి పెరిగిన పిచ్చి చెట్లతో స్థానికులు రాకపోకలకు అవస్థలు పడుతున్నారు. రాత్రి వేళలో రహదారిలో వెళ్లాలంటే ఆందోళన చెందుతున్నారు. పాములు, విషపురుగులు సంచరిస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సమస్యలను పరిష్కరించమని ఎన్నిసార్లు అధికారులకు మొరపెట్టుకున్నా పట్టించుకోవడం లేదని వాపోతున్నారు. ఇప్పటికైనా సమస్యలను పరిష్కరించాలని కాలనీవాసులు కోరుతున్నారు.

హెల్త్ యూనివర్సిటీ వీసీకి అభినందనలు

గుంటూరు మెడికల్: డాక్టర్ ఎన్టీఆర్ ఆరోగ్య విశ్వవిద్యాలయం వైస్‌చాన్సలర్‌గా నియమితులైన డాక్టర్ పి.చంద్రశేఖర్‌ను మంగళవారం ఆంధ్రప్రదేశ్ మెడికోస్ పేరెంట్స్ అసోసియేషన్ అధ్యక్షుడు డాక్టర్ ఆలా వెంకటేశ్వర్లు, ప్రముఖ హైకోర్టు న్యాయవాది వై.ఠాగూర్ యాదవ్ అభినందించారు. డాక్టర్ వెంకటేశ్వర్లు మాట్లాడుతూ మెడికల్ అడ్మిషన్లు మరింత పారదర్శకంగా జరిగేలా చూడాలన్నారు. అడ్మిషన్‌లలో అభ్యర్థుల శ్రేయస్సుకు ఎలాంటి నష్టం కలుగకుండా అన్ని చర్యలు తీసుకుంటామని వీసీ డాక్టర్ చంద్రశేఖర్ హామీ ఇచ్చినట్లు చెప్పారు.

సింగిల్ యూజ్ ప్లాస్టిక్‌పై పంజా!

- క్రయవిక్రయాలపై పూర్తిస్థాయిలో నిఘా
- ప్లాస్టిక్ నియంత్రణ వైపు అడుగులు
- నిరంతర తనిఖీల్లో అధికారులు



టీస్టాల్ వద్ద తనిఖీలు చేస్తున్న అధికారులు



దుకాణంలో ప్లాస్టిక్ వస్తువులను సీజ్ చేసిన కమిషనర్

పొన్నూరు: ప్రమాణాలకు విరుద్ధంగా వినియోగించే.. విక్రయించే ప్లాస్టిక్‌ను పట్టణంలో నిషేధించారు. స్వచ్ఛ పొన్నూరు భాగంగా ప్లాస్టిక్ నిషేధాన్ని పక్కాగా అమలు చేయాలని పురపాలక సంఘం అడుగులు వేస్తోంది. హోటళ్లు, షాపింగ్ మాల్స్, చిన్న దుకాణాల్లో సైతం సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వాడకాన్ని నిషేధించాలని మున్సిపల్ కమిషనర్ ముప్పాళ్ల రమేష్‌బాబు ఆదేశాలు జారీ చేశారు. ఇందుకు ప్రత్యేక బృందాలను సైతం ఏర్పాటు చేశారు. గతంలోనూ ఈ విషయంలో పలు చర్యలు తీసుకున్నా వివిధ కారణాలతో పూర్తిస్థాయిలో కట్టడి జరగలేదు. ఈసారైనా అడ్డుకట్టపడాలని పట్టణవాసులు కోరుతున్నారు.

ఈసారి నిషేధం పక్కాగా అమలు చేయాలంటే పూర్తిస్థాయిలో అమ్మకాల పైనే దృష్టి పెట్టాలని అధికారులు తీర్మానించుకున్నారు. నిషేధిత ప్లాస్టిక్ క్రయవిక్రయాలు అడ్డుకునేందుకు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేశారు. పురపాలక సంఘ అధికారులతో పాటు సచివాలయాల ఉద్యోగులను కూడా నియమించారు.

యజమానులకు జరిమానాలు..

మండలంలోని 29 గ్రామాలతో పాటు పరిసర మండలాలకు ప్రధాన వాణిజ్య కేంద్రంగా ఉన్న పట్టణంలో ప్లాస్టిక్ అమ్మకాలకు సంబంధించి హోల్‌సేల్ వ్యాపారమంతా సాగుతోంది. అన్ని దుకాణాలకు ప్లాస్టిక్ గ్లాసులు, ప్లేటులు, ప్రధానంగా కవర్లు అమ్మకాలు ఇక్కడి నుంచే వెళుతున్నాయి. ఇటీవల పట్టణంలోని రెండు దుకాణాలలో మున్సిపల్ అధికారులు దాడిచేసి ఏకకాలంలో 4 క్వింటాళ్ల ప్లాస్టిక్ వస్తువులను సీజ్ చేశారు. కాగా.. దుకాణ యజమానులకు రూ.3,500 జరిమానా కూడా విధించారు. నిడుబ్రోలు వంతెన వద్ద ఓ టీస్టాల్లో పాస్టిక్ కవర్లో టీ పార్శిల్ ఇస్తున్న యజమానికి రూ.2 వేలు జరిమానా విధించారు.

క్రయవిక్రయాలపై చర్యలు తప్పవు..

నిషేధిత పాస్టిక్ విక్రయించినా.. వినియోగించినా చర్యలు తప్పవు. పట్టణంలోని 31 వార్డుల్లోని చిన్న హోటళ్లు, బడ్డీ దుకాణాలతో పాటు వ్యాపార సంస్థల పైనా నిత్యం తనిఖీలు జరుగుతాయి. కల్యాణ మండపాలు, ఫంక్షన్ హాల్‌ల్లోనూ నిషేధిత ప్లాస్టిక్ వినియోగించినా 1965 ప్రజా ఆరోగ్య చట్టంను అనుసరించి అపరాధ రుసుం విధించనున్నాం.

– ముప్పాళ్ల రమేష్‌బాబు, మున్సిపల్ కమిషనర్, పొన్నూరు

బాధితులకు చెక్కుల పంపిణీ



చెక్కులు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే రామాంజనేయులు

గుంటూరు రూరల్: ఇన్నర్ రింగ్ రోడ్ పెండింగ్ పనులను వేగంగా చేపట్టి అందుబాటులోకి తీసుకురావడానికి కృషి చేస్తున్నామని.. ప్రజలు కూడా పనుల పురోగతికి సహకరించి ముందుకు రావాలని ప్రత్తిపాడు శాసనసభ్యుడు డాక్టర్ బూర్ల రామాంజనేయులు అన్నారు. మంగళవారం ఇన్నర్ రింగ్ రోడ్ ఫేజ్ 2, 3ల కనెక్టివిటీ ప్రాంతమైన స్వర్ణభారతినగర్ ప్రాంతంలో ఆక్రమణలు, బీ ఫారాల వారికి నిర్మాణ నష్ట పరిహార చెక్కులను అందించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ.. 12 కిలోమీటర్ల ఇన్నర్ రింగ్ రోడ్‌లో కేవలం 910 మీటర్లను విస్తరణ చేయకపోవడం వల్ల మిగిలిన రోడ్డు ఏర్పాటు చేసినప్పటికీ ఉపయోగంలో లేకుండా ఉందన్నారు. ఇన్నర్ రింగ్ రోడ్ పూర్తయితే పేరేచర్ల నుంచి నేరుగా కాకాని రోడ్ జాతీయ రహదారికి వెళ్లడానికి వీలవుతుందన్నారు. రోడ్డు నిర్మాణ పనుల్లో భాగంగా పెండింగ్‌లో ఉన్న ప్రాంతంలో ఖాళీ స్థలాలతో కలిపి 385 ఆస్తులు ప్రభావితం అవుతాయని.. వాటిలో 340 బి ఫారాలు, ఆక్రమణలు ఉన్నాయన్నారు. బి ఫారాలు, ఆక్రమణదారులకు నిర్మాణ నష్ట పరిహారాన్ని తొలివిడతగా 128 మందికి రూ.1.17 కోట్లు ఇస్తున్నామన్నారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు బి.స్మితపద్మజ, ఎన్.బాలాజీ, ఏసీపీ రెహ్మాన్, టీపీఎస్ సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

రైల్వే స్టేషన్‌లో తనిఖీలు



గుంటూరు రైల్వే స్టేషన్‌లో తనిఖీలు నిర్వహిస్తున్న రైల్వే జీఆర్పీ, ఆర్పీఎఫ్ పోలీసులు

లక్ష్మీపురం: గుంటూరు రైల్వే స్టేషన్‌లో మంగళవారం తనిఖీలు నిర్వహించారు. ఉగ్రదాడి నేపథ్యంలో అధికారుల సూచనల మేరకు ఆర్పీఎఫ్ సీఐ వీరబాబు, జీఆర్పీ సీఐ అంజిబాబు విస్తృతంగా తనిఖీలు చేశారు. ప్రయాణికులను క్షుణ్ణంగా పరిశీలించారు. సీఐలు మాట్లాడుతూ అనుమానంగా ఉన్నట్లు ప్రయాణికులు గమనిస్తే తక్షణమే తమకు సమాచారం తెలియజేయాల్సిందిగా కోరారు. రైల్వే స్టేషన్, అలాగే డివిజన్ సంబంధిత కార్యాలయల వద్ద తనిఖీలు నిర్వహిస్తున్నామన్నారు. తనిఖీలలో ఆర్‌పీఎఫ్ ఎస్ఐ నారాయణ రెడ్డి, మహిళా ఎస్ఐ జ్యోతి పాల్గొన్నారు.



ఆచార్య ఎన్జీరంగా వ్యవసాయ వర్సిటీలో మంగళవారం జరిగిన వజ్రోత్సవాల్లో పాల్గొని పుస్తకావిష్కరణ చేస్తున్న మంత్రి కింజరపు అచ్చెంనాయుడు, చిత్రంలో వీసీ డాక్టర్ ఆర్ శారదజయలక్ష్మిదేవి, తదితరులు



స్టాల్స్ ప్రారంభిస్తున్న మంత్రి కింజరపు అచ్చెంనాయుడు

– సాక్షి ఫొటోగ్రాఫర్, గుంటూరు

ముందస్తు పన్ను రూ.61.97 లక్షలు చెల్లించిన లలితా హాస్పిటల్స్



రెవెన్యూ సిబ్బందికి చెక్కును అందజేస్తున్న రాఘవ శర్మ

నెహ్రూనగర్: ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన ఆస్తి పన్నును ముందస్తుగా చెల్లించి పన్నుపై 5 శాతం, బకాయిలపై 50 శాతం వడ్డీ రాయితీ పొందేందుకు బుధవారం ఒక్కరోజే గడువు ఉందని, నగర ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని నగర కమిషనర్ పులి శ్రీనివాసులు తెలిపారు. మంగళవారం లలిత హాస్పిటల్స్ చైర్మన్ డాక్టర్ రాఘవ శర్మ ముందస్తు పన్ను రూ.61.97 లక్షలు చెల్లించారు. రాష్ట్ర ప్రభుత్వం ఆస్తి పన్నును ముందస్తుగా ఏక మొత్తంగా చెల్లించే వారికి 5 శాతం రాయితీ అవకాశాన్ని కల్పించిందని, ఈ నెల 30లోగా పన్ను ఏక మొత్తంగా చెల్లిస్తే పన్ను రాయితీ లభిస్తుందన్నారు. ఇప్పటికే నగరంలో పన్ను చెల్లింపుదారులు రూ.48.33 కోట్లు చెల్లించారని తెలిపారు. పన్ను చెల్లింపుదారులకు వీలుగా చివరి రోజైన బుధవారం రాత్రి 10 గంటల వరకు క్యాష్ కౌంటర్లు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకుంటున్నామని వివరించారు.

వైద్య కళాశాల మెయిన్ గేటు ప్రారంభం



వైద్యకళాశాల గేటును ప్రారంభిస్తున్న డాక్టర్ పవన్‌కుమార్


గుంటూరు మెడికల్: గుంటూరు వైద్య కళాశాల 2002 బ్యాచ్‌కు చెందిన ప్రముఖ న్యూరాలజిస్ట్ డాక్టర్ చెరుకూరి పవన్‌కుమార్, గుంటూరు వైద్య కళాశాలలో మెయిన్ గేటు నిర్మాణానికి రూ.8 లక్షలు విరాళంగా అందజేశారు. నిర్మాణ పనులు పూర్తవడంతో మంగళవారం డాక్టర్ పవన్‌కుమార్ ముఖ్య అతిథిగా విచ్చేసి కళాశాల మెయిన్‌గేటును ప్రారంభించారు. ఈసందర్భంగా వైద్య కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్.వి.సుందరాచారి మాట్లాడుతూ వైద్య కళాశాల అభివృద్ధికి పూర్వ వైద్య విద్యార్థులు పెద్ద మనస్సుతో సాయం చేస్తున్నారని చెప్పారు. పూర్వ విద్యార్థుల సాయంతో కళాశాలను కార్పొరేట్ సంస్థలకంటే ధీటుగా తీర్చిదిద్దుతున్నామని వివరించారు. జింకానా, పలు స్వచ్ఛంద సంస్థలు, పలువురు పారిశ్రామిక వేత్తలు, కళాశాల అభివృద్ధికి తమవంతు సాయం అందిస్తున్నారని, వారందరికి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్స్ డాక్టర్ శ్రీధర్, డాక్టర్ ప్రభాకర్ పాల్గొన్నారు.

జీజీహెచ్‌లో అరుదైన ఆపరేషన్

- 16 ఏళ్ల సమస్యకు చెక్ పెట్టిన వైద్యులు
- కోత, కుట్లు లేని ల్యాప్రోస్కోపి ఆపరేషన్

గుంటూరు మెడికల్: కామెర్ల సమస్యతో 16 ఏళ్లుగా బాధపడుతున్న మహిళకు గుంటూరు జీజీహెచ్ వైద్యులు కోత, కుట్లు లేని ల్యాప్రోస్కోపి ఆపరేషన్ చేసి సమస్యకు చెక్ పెట్టారు. మంగళవారం గుంటూరు జీజీహెచ్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో జనరల్ సర్జరీ ప్రొఫెసర్ డాక్టర్ ఏకుల కిరణ్‌కుమార్ ఆపరేషన్ వివరాలు వెల్లడించారు. ఉమ్మడి కృష్ణాజిల్లా బందర్‌కు చెందిన 44 సంవత్సరాల నాంచారమ్మకు 16 సంవత్సరాల క్రితం కామెర్ల వ్యాధి సోకింది. స్థానిక ప్రైవేటు వైద్యులు ఆమెకు వైద్యం చేసి మెరుగైన చికిత్స కోసం మరో కార్పొరేట్ ఆస్పత్రికి రిఫర్ చేశారు. అక్కడి వైద్యులు ఆటోఇమ్యూనో డిసీజ్ అని నిర్ధారణ చేశారు. 15 ఏళ్లుగా మందులు వాడుతూనే ఉంది. చికిత్స కోసం ఖర్చు భరించలేక జీజీహెచ్‌లో చేరారు. తొలుత గ్యాస్ట్రో ఎంట్రాలజీ వైద్యులు పసరునాళంలో రాయిని తీసి, స్టంట్ వేసినట్లు వివరించారు. పసరు తిత్తు, బల్ల సమస్య కోసం తమ వద్దకు రిఫర్ చేశారన్నారు. ఎలాంటి కోత, కుట్లు లేకుండా బటన్ హోల్ ల్యాప్రోస్కోపి ఆపరేషన్ ద్వారా పసరుతిత్తి, ఉబ్బిన బల్లను (స్ప్లీన్) విజయవంతంగా ఒక్క ఆపరేషన్‌తో తొలగించామన్నారు. ఆపరేషన్ ప్రక్రియలో తనతో పాటు, జనరల్ సర్జరీ వైద్యులు నాగ సంతోష్‌కుమార్, సాధిక్ బాషా, వేణుగోపాల్, మేఘన, అవిన్, హరి, మత్తు వైద్యులు పోలయ్య, శ్యామ్‌సన్, స్వేత, రిచి, గ్యాస్ట్రో ఎంట్రాలజీ వైద్యులు కవిత, నాగూర్‌బాషా, శివరామకృష్ణ, అనిల్, నవీన్ పాల్గొన్నట్లు డాక్టర్ కిరణ్‌కుమార్ వివరించారు. ఆపరేషన్ విజయవంతమయ్యేందుకు సహకరించిన జనరల్ సర్జరీ విభాగాధిపతి, ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ యశస్వి రమణలకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. అత్యంత క్లిష్టమైన ఆపరేషన్ చేసి 16 ఏళ్ల రోగి సమస్యను నయం చేసిన జనరల్ సర్జరీ వైద్యులకు ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ యశస్వి రమణ అభినందనలు తెలిపారు.

మే డే వేడుకలను జయప్రదం చేయండి



సమావేశంలో మాట్లాడుతున్న కంచర్ల కాశయ్య

తాడేపల్లి రూరల్: మే 1వ తేదీన నిర్వహించనున్న మే డే వేడుకలను జయప్రదం చేయాలని సీపీఐ తాడేపల్లి ప్రాంత కార్యదర్శి కంచర్ల కాశయ్య పిలుపునిచ్చారు. మంగళవారం తాడేపల్లి పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు.

కేంద్రంలో బి.జె.పి ప్రభుత్వం కార్మిక వ్యతిరేక విధానాలను అవలంభిస్తోందని మండిపడ్డారు. కార్మిక హక్కులను కాలరాసే లేబర్ కోడ్స్‌ను రద్దు చేయాలని.. ప్రభుత్వ రంగ సంస్థలను పరిరక్షించాలని కోరుతూ కేంద్ర ప్రభుత్వం కార్మిక, ప్రజా వ్యతిరేక విధానాలను నిరసిస్తూ మే 20న తలపెట్టిన అఖిల భారత సమ్మెను జయప్రదం చేయాలని కోరారు. మే 1వ తేదీన తాడేపల్లి పట్టణ, రూరల్ ప్రాంతాల్లో సీపీఐ, ఏఐటీయూసీ ఆధ్వర్యంలో నిర్వహించే మే డే వేడుకల్లో అందరూ పాల్గొనాలని కోరారు. కార్యక్రమంలో సీపీఐ తాడేపల్లి ప్రాంత సహాయ కార్యదర్శి తుడిమెల్ల వెంకటయ్య, షేక్ బాషా తదితరులు పాల్గొన్నారు.

ఉర్దూ భాషతో ఉజ్వల భవిష్యత్



పోస్టర్లు ఆవిష్కరిస్తున్న ఉర్దూ డీఐ ఖాసిం, ఉర్దూ అకాడమీ సిబ్బంది

గుంటూరు ఎడ్యుకేషన్: ఉర్దూ భాషతో ఉజ్వల భవిష్యత్ ఉంటుందని గుంటూరు ఉర్దూ షేక్ మొహమ్మద్ ఖాసిం పేర్కొన్నారు. ఉర్దూ భాషాభివృద్ధిలో భాగంగా గుంటూరులోని ఉర్దూ అకాడమీ ఆధ్వర్యంలో ఉర్దూ భాష ప్రాముఖ్యత, విద్య, ఉద్యోగావకాశాలపై రూపొందించిన పోస్టర్లను మంగళవారం చౌత్రా సెంటర్లోని ప్రభుత్వ బాలికోన్నత పాఠశాలలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఉర్దూ డీఐ ఖాసిం మాట్లాడుతూ ఉర్దూ భాషతో ఉజ్వల భవిష్యత్ ఉందని, ఉర్దూ భాష ప్రాముఖ్యతను ప్రతి ఒక్కరూ తెలుసుకోవాలని అన్నారు. ఉర్దూ భాషతో భారతదేశానికి విడదీయరాని అనుబంధం ఉందని, ఉర్దూ కేవలం ముస్లింల భాష కాదని, అది భారతీయుల భాష అని చెప్పారు. దీనిపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని అన్నారు. ఉర్దూ మాధ్యమంలో చదివిన ఎంతో మంది అత్యున్నత పదవుల్లో రాణిస్తున్నారని అన్నారు. ప్రాథమిక, ఉన్నత విద్యను ఉర్దూ మాధ్యమంలో చదివిన ఎంతో మంది ఐఏఎస్, ఐపీఎస్ సహా ఉన్నత ఉద్యోగాలు, ఉన్నత కేడర్లలో ఉన్నారని వివరించారు. తల్లిదండ్రులు తమ పిల్లలను ఉర్దూ మాధ్యమంలో చదివించే దిశగా ప్రోత్సహించాలని సూచించారు. కార్యక్రమంలో ఉర్దూ అకాడమీ కార్యాలయ సిబ్బంది షేక్ అక్బర్, ఫక్రుద్దీన్ అలీ, నయీమ్, రఫీ, అబ్దుల్లా ఖాన్, మెహబూదున్నీసా, మల్లికా సుల్తానా మరియు నాగూర్‌బాషా పాల్గొన్నారు.

క్రైస్తవుల న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలి



మాట్లాడుతున్న ఏఈఎల్‌సీ వెస్ట్ ప్యారిస్ చర్చ్ ఫాదర్ సతీష్‌కుమార్

నెహ్రూనగర్: క్రైస్తవుల న్యాయమైన డిమాండ్లను పరిష్కారించాలని ఏఈఎల్‌సీ వెస్ట్ ప్యారిస్ చర్చ్ ఫాదర్ రెవరెండ్ సతీష్‌కుమార్ ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. క్రైస్తవుల సమస్యల పరిష్కారం కోరుతూ కలెక్టరేట్ వద్ద నిర్వహిస్తున్న రిలే నిరాహార దీక్షలు మంగళవారానికి ఏడు రోజుకు చేరాయి. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశంలో క్రైస్తవులు శాంతికాముకులని, హింసవాదులు కాదని, చర్చిల్లో పాస్టర్ల బోధన ద్వారానే సమాజంలో నేర ప్రవృత్తి తగ్గిపోతుందన్నారు. అటువంటి క్రైస్తవుల పట్ల ప్రభుత్వం సానుభూతి వైఖరి కలిగి ఉండాలన్నారు. పాస్టర్ ప్రవీణ్ పగడాల మృతి విషయంలో నిజాలను వెలికితీయాలని, గుంటూరు నగరంలో క్రైస్తవుల సమాధుల కోసం స్థలాలను కేటాయించాలని కోరారు. దీక్షల్లో సామాజిక వేత్త డాక్టర్ గోళ్లమూడి రాజసుందరబాబు, డొక్కా జార్జీ, విజయలక్ష్మి, మార్కు, ఎం.ప్రేమజ్యోతిబాబు, రత్నకుమార్, మోషే పాల్గొన్నారు.

కార్మికుల పట్ల నిరంకుశంగా వ్యవహరిస్తున్న కేంద్రం

మంగళగిరి టౌన్: కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం కార్మికుల పట్ల నిరంకుశంగా వ్యవహరిస్తోందని వైఎస్సార్ ట్రేడ్ యూనియన్ నాయకులు విమర్శించారు. మంగళగిరి నగర పరిధిలోని సి.ఐ.టి.యు కార్యాలయంలో మంగళవారం పలు కార్మిక సంఘాల రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ఏఐటీయూసీ, సీఐటీయూసీ, వైఎస్సార్ ట్రేడ్ యూనియన్ నాయకులు హాజరయ్యి మాట్లాడారు. నరేంద్ర మోడీ ప్రభుత్వం రైతులకు నష్టం కలిగించే మూడు నల్ల చట్టాలను తీసుకువచ్చిందని అన్నారు. దీనికి వ్యతిరేకంగా రైతులు ప్రాణాలు అర్పించి రద్దు చేయించారని గుర్తు చేశారు. అయినప్పటికీ కేంద్రంలోని మోడీ ప్రభుత్వం కార్మిక వర్గాలు పోరాటాలతో సాధించుకున్న 44 కార్మిక చట్టాలను రద్దు చేసిందని విమర్శించారు. కార్మిక వ్యతిరేక విధానాలు అవలంభిస్తున్న మోడీ ప్రభుత్వానికి సార్వత్రిక సమ్మెలో కార్మికులు పెద్ద సంఖ్యలో పాల్గొని గుణపాఠం చెప్పాలని పిలుపునిచ్చారు. మే 17వ తేదీన బైక్ ర్యాలీ నిర్వహించాలని తీర్మానించినట్లు పేర్కొన్నారు. సమావేశంలో వైఎస్సార్ ట్రేడ్ యూనియన్ నాయకులు ఎస్.నాగరాజు, డి.అమరేశ్వరరావు, రత్నాకం శ్రీనివాసరాజు, ఆంధ్రప్రదేశ్ చేనేత కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పిల్లలమర్రి బాలకృష్ణ, ఎయిమ్స్ వర్కర్స్ యూనియన్ నాయకుల బుచ్చిబాబు, శ్రీనివాసులు, సీఐటీయూ నాయకులు బాలాజీ, చెంగయ్య, ఏఐటీయూసీ నాయకులు ప్రభాకర్, వివిధ కార్మిక సంఘాల నాయకులు పాల్గొన్నారు.

తలనీలాలు పోగు చేసే హక్కులు వేలం



పెదకాకాని: శివాలయంలో తలనీలాలు పోగు చేసుకునే హక్కుకు సంబంధించిన సీల్డ్ టెండరు కమ్ బహిరంగ వేలం పాట మంగళవారం ముగిసిందని ఆలయ డిప్యూటీ కమిషనర్ గోగినేని లీలాకుమార్ తెలిపారు. పెదకాకాని శ్రీ భ్రమరాంబ మల్లేశ్వరస్వామి దేవస్థానంలో 2025–26 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన 26 అంశాల వేలం పాటలు జరిగాయని ఆయన అన్నారు. తలనీలాల వేలం పాట ఆరుసార్లు వాయిదా పడటంతో నెల రోజులు ఆలస్యమైందని.. మంగళవారం ఏడోసారి జరిగిన వేలం పాటలో తమిళనాడుకు చెందిన దురాయ్ ఎంటర్ ప్రైజస్ నిర్వాహకుడు ముత్తు మోహన్ పాట దక్కించుకున్నారని పేర్కొన్నారు. 11 నెలలకు రూ.45,55,555 చెల్లించేలా హెచ్చు పాట పాడుకున్నారని అన్నారు. ఈ బహిరంగ వేలం పాటకు దేవదాయశాఖ పర్యవేక్షణాధికారిగా పెదకాకాని గ్రూపు దేవస్థానం కార్యనిర్వహణాధికారి కృష్ణంరాజు పాల్గొన్నట్లు లీలాకుమార్ తెలిపారు.

ఆర్థిక ఇబ్బందులతో ఆటో డ్రైవర్ ఆత్మహత్య



మృతి చెందిన రాజేష్

చేబ్రోలు: ఆర్థిక ఇబ్బందులతో ఆటో డ్రైవర్ గడ్డి మందు తాగి ఆత్మహత్య చేసుకున్న సంఘటన మండల కేంద్రమైన చేబ్రోలులో మంగళవారం చోటుచేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం.. చుండూరు మండలం నడిగడ్డిపాలెంకు చెందిన తలతోటి రాజేష్(35) ఆటో నడుపుతూ జీవనం సాగిస్తున్నారు. కొంతకాలం కిందట ఆటో ద్వారా రూ.లక్ష అప్పు తీసుకున్నారు. కుటుంబ సమస్యలు, ఆర్థిక ఇబ్బందులతో ఆయన ఫైనాన్స్ చెల్లింపులు చేయలేకపోయారు. దీనికి తోడు ఆర్థిక ఇబ్బందులు ఎక్కువ అవడంతో సోమవారం మధ్యాహ్నం చేబ్రోలులో గడ్డిమందు కొనుగోలు చేసి కొమ్మమూరు బ్రిడ్జి సమీపంలో మద్యంలో కలుపుకొని తాగారు. రాజేష్ కుటుంబ సభ్యులకు ఫోన్ చేసి ఆత్మహత్యాయత్నంకు పాల్పడినట్లు తెలిపారు. బంధువులు గుంటూరు ప్రభుత్వ వైద్యశాలకు రాజేష్‌ను తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ యువకుడు మంగళవారం మృతి చెందాడు. మృతునికి భార్య, ఇరువురు కుమార్తెలు, కుమారుడు ఉన్నారు. పోస్టుమార్టం అనంతరం కుటుంబ సభ్యులకు మృతదేహాన్ని అందజేశారు. ఎస్ఐ డి.వెంకట కృష్ణ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

జీజీహెచ్‌లో గ్లోసైన్ బోర్డు ఏర్పాటు



గుంటూరు మెడికల్: స్థానిక జీజీహెచ్ ఆవరణలో రోటరీ క్లబ్ సెంటెనియల్ గుంటూరు వారు వితరణగా అందజేసిన గ్లోసైన్ బోర్డును ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ యశస్వి రమణ మంగళవారం లాంఛనంగా ప్రారంభించారు. ఆస్పత్రి అభివృద్ధికి దాతలు చేస్తున్న సాయం ఎంతో విలువైనదని పేర్కొన్నారు. రోటరీ క్లబ్ అనేక మార్లు ఆస్పత్రిలో రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు సాయం అందిస్తుందని, క్లబ్ సేవలు విలువైనవని కొనియాడారు. సుమారు రూ.75 వేలు విలువ చేసే బోర్డును ఏర్పాటు చేసినందుకు ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమం రోటరీ క్లబ్ సెంటెనియల్ గుంటూరు అధ్యక్షుడు పొనకాల బాల సుబ్రహ్మణ్యం, కార్యదర్శి నవీన్ చక్రవర్తి, క్లబ్ డైరెక్టర్లు డాక్టర్ వీర రాఘవ, సంతోష్, కోట మురళీకృష్ణ పాల్గొన్నారు.

రైతులకు రాయితీపై విత్తనాలు

పెదవడ్లపూడి(మంగళగిరి): నగర పరిధిలోని పెదవడ్లపూడి, చినవడ్లపూడి గ్రామాల రైతులకు ప్రభుత్వం సబ్సిడీతో విత్తనాలు, పనిముట్లను పంపిణీ చేసింది. మార్కెట్ యార్డు చైర్మన్ జువ్వాది కిరణ్ చందు రైతులకు పనిముట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో మండల వ్యవసాయ శాఖాధికారి శైలజారాణి, రాష్ట్ర సివిల్ సప్లైస్ డైరెక్టర్ తోట పార్థసారధి పాల్గొన్నారు.